18

# “తండ్రియైన అబ్రాహాము”

## (4:9-17ఎ)

పాత, క్రొత్త నిబంధనలలో అబ్రాహాము కీలకమైన వ్యక్తియై ఉన్నాడు. క్రొత్త నిబంధనలో పౌలు పేతురులకంటె ఎక్కువ తరచుగా అతని పేరు కన్పిస్తుంది![1] రెండు నిబంధనలలోను అతడు దేవుని స్నేహితుడైయుండినట్టు సూచించబడ్డాడు (యెషయా 41:8; యాకోబు 2:23). Hugo McCord యిలా అన్నాడు, “దేవుడు అతనియందు బహుగా ఆనందించాడు ఎందుకంటె అతడు దేవునియందు బహుగా ఆనందించాడు.”[2]

రోమా 4లో విశ్వాసంవలన నీతిమంతుడుగా తీర్చబడే పౌలు యొక్క ప్రధానమైన ఉదాహరణ అబ్రాహాము. ఈ పాఠము 4:9–17ఎ మీద కేంద్రీకరించబడింది. ఈ లేఖన భాగంలోని చర్చనీయాంశం అబ్రాహాము యొక్క పితృత్వము. 12వ వచనంలో “మన తండ్రియైన అబ్రాహాము” అని పిలువబడ్డాడు. వచనం 17లో అబ్రాహాము “మనకందరికి తండ్రియైయున్నాడు” అని పౌలు అన్నాడు; 11వ వచనంలో “నమ్మినవారి కందరికి అతడు తండ్రియగుటవలన” అని ఉంది.

మూల వాక్యాన్ని మనం చదువక ముందు, అబ్రాహాము జీవితంలోని కీలక సంభవాలును, అవి సంభవించిన క్రమాన్ని మనం జ్ఞాపకం చేసికొందాం. అబ్రాహాము 60 ఏండ్ల ప్రాంతంలో ఉన్నప్పుడు దేవుడు అతనిని కల్దీయుల ఊరునుండి పిలిచాడు (ఆదికాండము 11:31; 15:7). అతడు, అతని తండ్రియైన తెరహును కుటుంబంలోని యితరులును హారానుకు కదలి వచ్చారు (“అబ్రాహాము ప్రయాణ స్థలాల పటాలను” చూడు). తెరహు యొక్క మరణానంతరం (11:32), అబ్రాహాము 75 ఏండ్లవాడై ఉండినప్పుడు (12:4), దేవుడు అతనికి ప్రత్యక్షమై యిలా సెలవిచ్చాడు,

> … నీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువులయొద్దనుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమియొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడును (ఆదికాండము 12:1బి–3).

దేవుడు అబ్రాహాముకు ఆస్తి వాగ్దానం, ప్రజల వాగ్దానం, కాపుదల వాగ్దానం యిచ్చాడు; అయితే మనకు అత్యధికమైన అభిలాషను కలిగించేది సంకల్ప వాగ్దానం: “భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదింపబడును” అని చెప్పబడింది (గలతీయులకు 3:8 చూడు).

అబ్రాహాము కనానుకు చేరుకున్నాడు; కాని ఒక దశాబ్దమో ఎంతో గడచిన పిమ్మట కూడా అబ్రాహాము శారాలకు పిల్లలు లేకపోయారు. అబ్రాహాము యొక్క సంతతి భూమిమీదనున్న రేణువులవలెను (ఆదికాండము 13:16), ఆకాశపు నక్షత్రములవలెను అసంఖ్యాకులౌతారని దేవుడు అతనికి అభయమిచ్చాడు (ఆదికాండము 15:5). ఆ సమయమందు, అబ్రాహాము "యెహోవాను నమ్మెను; ఆయన అది అతనికి నీతిగా ఎంచెను" అని చెప్పబడింది (ఆదికాండము 15:6).

మరొక 14 సంవత్సరాలు గతించాయి. అబ్రాహాము 99 ఏండ్లవాడైనప్పుడు, దేవుడు అతనికి మరల ప్రత్యక్షమై యిలా సెలవిచ్చాడు,

> … ఇదిగో నేను నియమించిన నా నిబంధన నీతో చేసియున్నాను; నీవు అనేక జనములకు తండ్రివగుదువు. మరియు ఇక మీదట నీ పేరు అబ్రాము ["గొప్ప తండ్రి"] అనబడదు; నిన్ను అనేక జనములకు తండ్రినిగా నియమించితిని గనుక నీ పేరు అబ్రాహాము ["అనేకులకు తండ్రి"] అనబడును. నీకు అత్యధికముగా సంతానవృద్ధి కలుగజేసి నీలోనుండి జనములు వచ్చునట్లు నియమించుదును, రాజులును నీలోనుండి వచ్చెదరు (ఆదికాండము 17:4-6).

ఆ సమయమందు, సున్నతి అనే ఆచార కర్మను దేవుడు స్థాపించాడు (ఆదికాండము 17:9-14, 23-27). "అది నాకు నీకు మధ్యనున్న నిబంధనకు *సూచనగా* ఉండును" అని దేవుడు సెలవిచ్చాడు (11 వచనం; నొక్కి చెప్పింది నాది).

తరువాత పాఠంలో, అబ్రాహాము జీవితాన్ని గూర్చి యింకా ఎక్కువ చెప్పుదాం; అయితే ప్రస్తుతానికి, మనము ఒక్క చివరి సంఘటనను గమనించ గోరతాం. 22వ అధ్యాయంలో,[3] తన విశ్వాసం యొక్క బహు కష్టమైన పరీక్షను ఎదుర్కొన్న తరువాత, దేవుడు అతనితో తన నిబంధనను సరిక్రొత్తదిగా చేసి, యిలా అన్నాడు: "… భూలోకములోని జనములన్నియు *నీ సంతానమువలన* ఆశీర్వదింపబడును" (22:18ఎ; నొక్కి చెప్పింది నాది).

మూల వాక్యాన్ని[4] మనం పరీక్షించుచుండగా, ఈ కాలక్రమ సంఘటనలు మనస్సులో ఉంచుకో. "విస్మయమైన 'దేవుని లెక్కించు ఏర్పాటు' " చట్టము/క్రియా నియమానికిని, కృపా/విశ్వాస నియమానికిని తారతమ్యం చేస్తుంది. ఏదియెలాగున్నా, మన స్టడీ యొక్క కేంద్రీకరణ "తండ్రియైన అబ్రాహాము" మీద ఉంది. అతడు "మనకందరికి ఎందుకు తండ్రియై" ఉన్నాడో మనం కనుగొన గోరతాం.

## అతడు "తండ్రియైన అబ్రాహాము" ఎందుకంటే అతడు సున్నతి పొందక ముందే నీతిమంతుడని తీర్చబడ్డాడు (4:9-12)

యూదులందరి హృదయాలకు రెండు వాస్తవాలు అతి ప్రియంగా ఉంటాయి: వారు సున్నతి పొందినవారనే వాస్తవం మరియు వారికి మోషే ధర్మశాస్త్రముందనే వాస్తవం. ఇవి వారిని *యూదులుగాను* దేవుని దృష్టిలో *ప్రత్యేకమైనవారినిగాను* నిలిపింది. తాము

నీతిమంతులుగా తీర్చబడడానికి[5] సున్నతి మీదను ధర్మశాస్త్రం మీదను ఆనుకొన్నారు. రోమా 2లో, పౌలు మొదట ధర్మశాస్త్రాన్ని చర్చించాడు (17–24 వచనాలు) ఆ తరువాత సున్నతిని (25–29 వచనాలు). 4:9–12లో, ఆ రెండు విషయాలనే తిరిగి – వ్యతిరేక క్రమంలో అతడు చర్చించాడు.

**"సున్నతి పొందక ముందే"**

మన గత పాఠం యొక్క మూల వాక్యము ఈ రెండు పదాలతో ముగించింది:

> ఆ ప్రకారమే క్రియలు లేకుండ దేవుడెవనిని నీతిమంతుడుగా ఎంచునో ఆ మనుష్యుడు ధన్యుడని దావీదు కూడ చెప్పుచున్నాడు: ఏలాగనగా, "తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు. **ప్రభువు** చేత నిర్దోషియని ఎంచబడినవాడు ధన్యుడు" (4:6–8).

ఆ లేఖనంలో "ధన్యత" అనేది పాపముల క్షమాపణను సూచిస్తుంది. "ఈ ధన్య వచనము సున్నతిగలవారినిగూర్చి చెప్పబడినదా సున్నతిలేనివారినిగూర్చి[6] చెప్పబడినదా?" అని పౌలు తరువాత అడిగాడు (9ఎ వచనం). అంటే, కేవలం యూదులు మాత్రమే పాపములు క్షమించబడతారా, లేక అన్యజనులు కూడ క్షమించబడతారా? "ఆలాటి దీవెనలు యూదులకు మాత్రమే!" అని అనేకమంది యూదులు జవాబు యిచ్చేవారే. ఏదియెలాగున్నా, దేవుని కృపా ఏర్పాట్లు *అందరికని* పౌలు స్థాపిస్తాడు.

మొదటిగా పౌలు తన పాఠకులకు రుజువు చేసే తన మూల వాక్యాన్ని గుర్తు చేశాడు (ఆదికాండము 15:6): " 'అబ్రాహాము యొక్క విశ్వాసమతనికి నీతి అని యెంచబడెననుచున్నాము' గదా?" [*logizomai*] (రోమా 4:9బి). తరువాత అతడు యిలా అడిగాడు, "అది ఏ స్థితియందు [*logizomai*] ఎంచబడెను?" [అబ్రాహాముకు నీతిగా]? "సున్నతి కలిగియున్నప్పుడా సున్నతి లేనప్పుడా?" (10ఎ వచనం). ఈ ప్రశ్ననే అనేకమంది యూదులు ఎన్నడు యోచించియుండరు.

తన ప్రశ్నకు పౌలు తానే బదులిచ్చుకొంటున్నాడు: "సున్నతి కలిగియుండినప్పుడు కాదు సున్నతి లేనప్పుడే" (10బి వచనం). విశ్వాసమువలన అబ్రాహాము నీతిమంతుడుగా తీర్చబడిన (సంగతి) ప్రతిపాదన ఆదికాండము 15లో ఉండగా, సున్నతి అనే ఆచార కర్మను ఆయన స్థాపించింది ఆదికాండం 17లో – కనీసం 14 సంవత్సరాల తరువాతనే.[7] సున్నతి వారిని "యూదులుగా" చేసినట్టు యూదుల్లోని పురుషులు నమ్మారు. వారు యూదులను "సున్నతిగలవారని," అన్యజనులను "సున్నతిలేనివారని" సూచిస్తుండేవారు. ఈ విధంగా, వారి సొంత రీజనింగ్ ప్రకారమే, అబ్రాహాము విశ్వాసమువలన నీతిమంతుడుగా తీర్చబడింది అతడు "యూదుడుగా" ఉండినప్పుడు కాదు – అతడింకను "అన్యజనుడుగా" ఉండినప్పుడే!

అది మరొక ప్రశ్నను రేపుతుంది: అదేమంటే, అబ్రాహామును అతని యింటనున్న యితర పురుషులను సున్నతి పొందవలెనని దేవుడు ఎందుకు ఆజ్ఞాపించినట్టు? అది రక్షించబడుటకు కాకుంటే, ఆ కర్మకాండ యొక్క ఉద్దేశమేమి? పౌలు యిలా కొనసాగించాడు:

"అతడు [అబ్రాహాము] సున్నతి పొందకమునుపు, తనకు కలిగిన విశ్వాసము వలననైన నీతికి ముద్రగా [*sphragis*] సున్నతి అను గురుతు [*semeion*] పొందెను" (రోమా 4:11ఎ). ఆ కర్మకాండను ఏర్పరచడంలో, దేవుడు అబ్రాహాముకు యిలా చెప్పాడు, "మీరు ... సున్నతి పొందవలెను. అది నాకు నీకు మధ్యనున్న నిబంధనకు సూచనగా[s] ఉండును" (ఆదికాండము 17:11; నొక్కి చెప్పింది నాది). రక్షింపబడడానికని సున్నతి యూదులకు యివ్వబడలేదు, కాని అది యొక "గురుతుగా" మరియు "ముద్రగా" యివ్వబడింది: "గురుతు వారిని సూచించడానికి" మరియు "ముద్ర వారిని రూఢిపరచడానికి."[9]

"అలాగే బాప్తిస్మం కూడా. మన రక్షణకు దానికి ఏ సంబంధం లేదు, కాని మనం నీతిమంతులముగా తీర్చబడడానికి అది కేవలం గురుతు మరియు ముద్రయై ఉందని" ఈ పాయింటు వద్ద అనేకమంది మతశాఖల వ్యాఖ్యానకర్తలు చేర్చారు. ఆలాటి వర్తింపు ఏదియు పౌలు ఉద్దేశించినట్టు ఏ సూచనయు లేదు అన్నది వాస్తవమైనా, వారు ఈలాటి సాహసమైన మాటలంటారు. "రోమా 4లో బాప్తిస్మం గూర్చి ఏదైనా ఉండకపోవచ్చు." అని ఒక మతశాఖ వ్యాఖ్యానకర్త అంగీకరించాడు.[10] (మనం బాప్తిస్మం పొందినప్పుడు పొందే పరిశుద్ధాత్మను; అపొస్తలుల కార్యములు 2:38) పౌలు "ముద్రగా" సూచించాడు (ఎఫెసీయులకు 1:13, 14 చూడు). రోమా 6కు చేరుకున్నప్పుడు మనం బాప్తిస్మం యొక్క ఉద్దేశాన్ని చర్చించుతాం.

### "నమ్మినవారికందరికి అతడు తండ్రి"

"మరియు సున్నతి లేనివారైనను, నమ్మినవారికందరికి అతడు తండ్రియగునట్లు" సున్నతి పొందక ముందే అబ్రాహాము నీతిమంతుడుగా విశ్వాసమువలన తీర్చబడ్డాడని పౌలు తేల్చాడు (4:11బి). అబ్రాహాము శరీర విషయములో యూదులకు (*propator*) మూలపురుషుడనియు (1 వచనం); యేసునందు విశ్వాసముంచిన అన్యజనులకు ఆత్మ సంబంధంగా తండ్రి (*pater*) అని పౌలు గుర్తించాడు. అన్యజనులు విశ్వసించినట్టయితే, "నీతి" (దేవునితో సరియైన స్థితి) "వారికి ఆరోపించబడుతుంది [*logizomai*]" అబ్రాహామునకు జరిగినట్టే (11సి వచనం). "అది వారి లెక్కకు జమచేయబడుతుందని" AB అంటుంది. "దేవుని విస్మయమైన 'లెక్కించు ఏర్పాటు' " అందరికి అందుబాటులో ఉంది!

ఇది యూదులను విడిచిపెడుతుందా? లేదు, అబ్రాహాము "సున్నతిగలవారికిని తండ్రి [*pater*]యే" (12ఎ వచనం). ఏదియెలాగున్నా, యూదులు గ్రహించవలసిందేమంటే, "అబ్రాహాము సున్నతిగలవారికి మాత్రమే గాక, అతనికి కలిగిన విశ్వాసము యొక్క అడుగుజాడలనుబట్టి నడుచుకొనువారికిని తండ్రియైయున్నాడు" (12బి వచనం; నొక్కి చెప్పింది నాది). తన విమర్శకులకు ప్రభువైన యేసు యిలా తెలిపారు "[నిజముగా] మీరు అబ్రాహాము పిల్లలైతే అబ్రాహాము చేసిన క్రియలు చేతురు" (యోహాను 8:39; NIV). "అతడింకను సున్నతిపొందకయున్నప్పుడు" అబ్రాహాము ఎట్టి విశ్వాసము గలవాడై యుండెనో, ప్రత్యేకించి వారు అట్టి విశ్వాసముగలవారైయుండాలి (రోమా 4:12సి).

అబ్రాహాము "నమ్మినవారికందరికిని తండ్రి" (11 వచనం) అని పౌలు యొక్క మొదటి రుజువు, వారి భావనలో, "యూదుడు అవ్వడానికి" సంవత్సరాలకు ముందు

విశ్వాసంవలన నీతిమంతుడుగా తీర్చబడ్డాడు అనేది. అందువలన నీతిమంతులుగా తీర్చబడడం "విశ్వాసంవలననే గాని శరీరాన్ని బట్టి కాదు."[11] దేవుడు సున్నతిలేని విశ్వాసిని అంగీకరిస్తాడు కాని సున్నతిగల అవిశ్వాసిని నిరాకరిస్తాడనేది అనేకమంది యూదులకు ఎంత దిగ్భ్రమ కలిగించేదిగా వినిపించాలో అది అంతగా వినిపించియుంటుంది!

నీవు దేవునిచే అంగీకరింపబడాలంటే, నీవు కూడా "అబ్రాహాము యొక్క విశ్వాసపు అడుగుజాడలలో నడుచుకోవలసియుంటుంది." ప్రత్యేకించి, అబ్రాహాము యొక్క క్రొత్త నిబంధన బిడ్డగా, నీ నమ్మిక ప్రభువైన యేసునందు ఆయన అభీష్టమందు నీవు నమ్మిక ఉంచవలసియుంది.

## అతడు "తండ్రియైన అబ్రాహాము" ఎందుకంటె ధర్మశాస్త్రం యివ్వబడక ముందు అతడు నీతిమంతుడుగా తీర్చబడ్డాడు (4:13-17ఎ)

యూదులను యితరులనుండి వేరుచేసిన రెండవ దానివైపు పౌలు తిరిగాడు: అది మోషే ధర్మశాస్త్రం. "అబ్రాహాము నీతిమంతుడుగా తీర్చబడడంతో సున్నతికి ఏ విధమైన తావు లేకపోతే, … ధర్మశాస్త్రానికి దానితో యింకను తక్కువ సంబంధమే ఉంటుంది" అన్నట్టు F. F. Bruce అభిప్రాయపడ్డాడు.[12]

### "వాగ్దానం"

"అతడు లోకమునకు వారసుడగునను వాగ్దానము అబ్రాహాముకైనను అతని సంతానమునకైనను"[13] అని పౌలు మొదట సూచించాడు (4:13ఎ). "వాగ్దానము" అని తర్జుమా చేయబడిన మాట (*epangelia*) అనేది 4:13–21లో కీలక పదమైయుంది. దీని నామవాచకపు రూపం నాలుగుసార్లు కన్పిస్తుంది (13, 14, 16, 20 వచనాలు), క్రియా రూపం ఒక్కసారి మాత్రమే కన్పిస్తుంది (21 వచనం). అబ్రాహామును, "అతని సంతతివారును" లోకమునకు వారసులగుదురనే "వాగ్దానాన్ని" యివన్నీ సూచిస్తాయి. ఇందు మిగిలిన భాగంలో, నేను దీనిని "The promise" అని సూచిస్తుంటాను.

అబ్రాహాము "లోకమునకు వారసుడౌతాడనడానికి" ఆదికాండంలో ప్రత్యేకించిన ఏ వాగ్దానము లేదు,[14] అందువలన యిది దేవుడు అబ్రాహాముకు చేసిన అనేక వాగ్దానాలను సంగ్రహం చేసే పౌలు యొక్క విధానమైయుండవచ్చు. వీటిలో ఒకటి అపొస్తలుని మనస్సులో పై భాగాన ఉండియుండవచ్చు. అదేమంటే: "భూలోకములోని జనములన్నియు నీ సంతానమువలన ఆశీర్వదించబడును …" (ఆదికాండము 22:18ఎ; నొక్కి చెప్పింది నాది; 12:3 చూడు). ఇది మెస్సీయను గూర్చిన వాగ్దానమని పౌలు మరియొక చోట సూచించాడు: "అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు – 'సంతానములకును' అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే – 'నీ సంతానమునకును' అనెను; ఆ సంతానము క్రీస్తు" (గలతీయులకు 3:16).

అబ్రాహామునకు ఆత్మసంబంధమైన సంతతియైన క్రీస్తు ద్వారా, అబ్రాహాము

"లోకమునకు వారసుడయ్యాడు" (మత్తయి 5:5 పోల్చి చూడు). కొరింథులోని సంఘానికి పౌలు రాసినప్పుడు, "సమస్తమును మీవి ... లోకమైనను, జీవమైనను, మరణమైనను, ప్రస్తుతమందున్నవియైనను, రాబోవునవియైనను సమస్తమును మీవే" (1 కొరింథీయులకు 3:21బి, 22). సమస్తమును దేవునికి "చెందినవి." మనం ఆయన పిల్లలం. ఆ భావంతో సమస్తమును మనవే. దేవుడు తన పిల్లల విషయంలో శ్రద్ధ వహిస్తాడు, మనకు కావలసినవి మనకు లభించేలా ఆయన జాగ్రత్త తీసికొంటాడు.

> "... ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, ఏమి ధరించుకొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ... మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" (మత్తయి 6:25-33).

## "ధర్మశాస్త్రం ద్వారా కాదు"

> అతడు లోకమునకు వారసుడగునను వాగ్దానము అబ్రాహామునకైనను అతని సంతానమునకైనను ధర్మశాస్త్ర మూలముగా కలుగలేదు గాని విశ్వాసమువలననైన నీతి మూలముగానే కలిగెను. ధర్మశాస్త్ర సంబంధులు వారసులైనయెడల విశ్వాసము వ్యర్థమగును. వాగ్దానమును నిరర్థకమగును. ఏలయనగా ధర్మశాస్త్రము ఉగ్రతను పుట్టించును; ధర్మశాస్త్రము లేనియెడల అతిక్రమమును లేకపోవును.
> ఈ హేతువుచేతను ఆ వాగ్దానము ... కృప ననుసరించునదైయుండునట్లు, అది విశ్వాసమూలమైనదాయెను (4:13-16ఎ).

దేవుడు అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానం చేశాడు, కాని అది మోషే ధర్మశాస్త్రమియ్యబడినందున జరిగింది కాదు.[15] ఆ వాగ్దానము "ధర్మశాస్త్ర మూలముగా కలుగలేదు" అని పౌలు చెప్పాడు (4:13బి): అది ధర్మశాస్త్ర మూలంగా కలిగేది కాదు ఎందుకంటె ఆ వాగ్దానం చేయబడిన "నాలుగు వందల ముప్పది సంవత్సరములైన తరువాతనే" ధర్మశాస్త్రం వచ్చింది (గలతీయులకు 3:17). ఆ వాగ్దానము "విశ్వాసమువలననైన నీతిమూలముగానే కలిగెను" (రోమా 4:13సి) అని పౌలు తెలిపాడు.

(వాగ్దానం చేయబడిన) శతాబ్దాల తరువాతనే ధర్మశాస్త్రం యివ్వబడిందనే వాస్తవం వాగ్దానంతో ధర్మశాస్త్రానికి ఏలాటి సంబంధం లేదనడానికి చాలినంత రుజువైయుంటుంది. పౌలు దాన్ని అక్కడ విడిచిపెట్టలేదు. ధర్మశాస్త్రము/క్రియల నియమం, కృప/విశ్వాస నియమం అనేవాటి మధ్యగల తారతమ్యాన్ని యింకను ముందుకు కొనిపోడానికి అతడు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. 13, 14 వచనాలలో "law"కు ముందు (ఆంగ్లంలో "the") అనేలాటి definite article ఆది మూల వాక్యంలో లేదు. ప్రత్యేకంగా మోషే ధర్మశాస్త్రం పౌలు మనస్సులో ఉన్నట్టు సందర్భం తెలియజేస్తుంది. Definite article లేకపోయినందున సాధారణమైన వర్తింపు చేయవచ్చు. ధర్మశాస్త్రాన్ని ఆచరించడం మీద వాగ్దానపు నెరవేర్పు ఆధారపడియున్నట్టయితే, వాగ్దానం ఎన్నడూ నెరవేర్చబడకుండ ఉండేదే. ఎందుకంటే ఎవడును – అబ్రాహాము సహితము – ధర్మశాస్త్రాన్ని (ఏ చట్టాన్నైనా) పరిపూర్ణంగా నెరవేర్చలేదు. గనుక, పౌలు యొక్క తీర్మానమేమంటే, వాగ్దానమనేది కృప/

విశ్వాస నియమం మీద ఆధారపడింది – అనేది: అది "విశ్వాసమువలననైన నీతి మూలముగానే కలిగెను" (13సి వచనం).

"ధర్మశాస్త్ర సంబంధులు వారసులైనయెడల విశ్వాసము వ్యర్థమగును, వాగ్దానమును నిరర్థకమగును" (14 వచనం). "ధర్మశాస్త్ర సంబంధులు" అనే ప్రయోగాన్ని పౌలు ఉపయోగించినప్పుడు, ప్రాథమికంగా అతని మనస్సులో యూదులున్నారు (16 వచనం చూడు). ఏదియెలాగున్నా, 14వ వచనంలో "law" అనేది ఆది భాషలో సాధారణ పదమైనందున, చట్టపరమైన/క్రియా నియమం మీద ఆధారపడే ఎవనికైనా అది వర్తిస్తుంది. వాగ్దానాన్ని పొందడమనేది చట్టపరమైన/క్రియా నియమం మీద ఆధారపడినట్టయితే, అప్పుడు రెండు ఫలితాలు వస్తాయి (సంభవిస్తాయి).

మొదటిగా, విశ్వాసము "వ్యర్థమగును." "వ్యర్థమగును" (*kenos*) అనే పదం ప్రాథమికంగా "వట్టిది"[16] "పూర్తిగా అర్థ శూన్యమైయుంటుంది" అని AB అంటుంది. చట్టపరమైన/క్రియా నియమము మరియు కృప/విశ్వాస నియమము అనేవి పొసగనివై ఉంటాయి. చట్టపరమైన క్రియా నియమాన్ని స్థాపించితే, కృప/విశ్వాస నియమం ఎత్తి వేయబడుతుంది (అంటే, ఎవడును చట్టాన్ని సంపూర్ణంగా అనుసరించలేడు గనుక, మనం శిక్షావిధికే పాత్రులమై ఉంటాం).

రెండవ ఫలితమేమంటే, వాగ్దానము "నిరర్థకమగును." "నిరర్థకమగును" అనేది *katargeo* నుండి తర్జుమా చేయబడింది. దీనికి అర్థం "నిర్వ్యాపారమునకు తగ్గించు" (*kata* ["క్రిందికి"] + *argos* ["నిర్వ్యాపారము"]).[17] "రద్దు చేయబడి శక్తిలేనిదగు" అని AB అంటుంది. దేవుని చట్టాన్ని నిర్దోషంగా ఆచరించినందువలన అబ్రాహాముకు వాగ్దానం చేయబడలేదు, కాని అతనికి విశ్వాసమున్నందువలన [చేయబడింది] (గలతీయులకు 3:18తో పోల్చు). చట్టాన్ని ఆచరించడం మీద వాగ్దానం ఆధారపడి ఉన్నట్టయితే, "దాన్ని మనం మరచిపోవచ్చు" – ఎందుకంటే అది ఎన్నడూ నెరవేర్చబడదు.

అది ఎందుకైయుంటుంది? ఎందుకంటే, చట్టాన్ని ఆచరించడమే దీవెనలకు కారణం అవ్వడానికి బదులు, "ధర్మశాస్త్రము ఉగ్రతను పుట్టించును [*orge*]" అని పౌలు తెలిపాడు (రోమా 4:15ఎ). వచనం 15లో "law"కు ముందు definite article ఉంది. గనుక ధర్మశాస్త్రము/క్రియా నియమం "విధికి మినాయింపు" (an exception to the rule) గా ఉండాలని భావించే యూదులను పౌలు నేరుగా ఎదుర్కొంటున్నాడు.

"ధర్మశాస్త్రము ఉగ్రతను పుట్టించును" అని పౌలు అన్నప్పుడు, మోషే ధర్మశాస్త్రానికి విలువ లేదని పౌలు చెప్పలేదు (7:12 చూడు); అది దేవునిచే అనుగ్రహింపబడింది కాదా. ఎవడును (చట్టాన్ని) ధర్మశాస్త్రాన్ని నిర్దోషంగా అనుసరించలేడు గనుక చివరికి ధర్మశాస్త్రం (చట్టం) చేయగలిగిందంతా "ఉగ్రతను పుట్టించడమే." 7వ అధ్యాయంలో దీన్ని మనం ఎక్కువగా చర్చించుదాం. ప్రస్తుతానికి, ఈ క్రింది మార్గాల్లో ధర్మశాస్త్రము ఉగ్రతను పుట్టిస్తుందని కేవలం గుర్తించుదాం:

- ధర్మశాస్త్రంవలన (పాపమనగా ఎట్టిదో) తెలియబడుచున్నది (3:20).
- ఒక విధంగా, అది పాపాన్ని ప్రోత్సహించుతోంది. (ఫలానిది చేయవద్దని

చెప్పినప్పుడు కొంతమంది పిల్లల ప్రతిచర్యను గూర్చి ఆలోచించు) (5:20ఎ; 7:5 చూడు).
- పాపానికి అది శిక్ష విధిస్తుంది (ద్వితీయోపదేశకాండము 28:58, 59).

[చట్టం] ధర్మశాస్త్రంతో ఉన్న సమస్య ఏమంటే "లక్షణాలను బట్టి ఇబ్బందిని నిర్ధారిస్తుంది కాని అది నివారణను అనుగ్రహించలేదు."[18]

"ధర్మశాస్త్రము ఉగ్రతను పుట్టించుననని" చెప్పిన మీదట, తన పాఠకులను తికమక పెట్టే ప్రతిపాదనను పౌలు చేస్తున్నాడు: "ధర్మశాస్త్రము లేనియెడల అతిక్రమమును లేకపోవును" (4:15బి). "అతిక్రమము" అని తర్జుమా చేయబడిన పదం *parabasis,* ఈ పదము తరచుగా "అతిక్రమము" అని తర్జుమా చేయబడుతుంది (KJV చూడు).[19] చట్టాన్ని నేరుగా ఉల్లంఘించుటను ఈ పదం గుప్తం చేస్తుంది.

అతని ఆలోచనను విస్తరింపజేస్తే పౌలు ప్రవేశపెట్టినదాన్ని మనం బాగా అర్థం చేసికోగలుగుతాం. గ్రీకులోగాని, ఆంగ్లంలోగాని "law"కు ముందు definite article లేదు, గనుక law అనేదానికి సంబంధించి సూత్రం సాధారణమైనదే.

- "చట్టం ఎక్కడ లేదో, అక్కడ అతిక్రమమూ లేదు." దీనినుండి, ఎక్కడ చట్టముందో అక్కడ అతిక్రమం [ఉల్లంఘన] ఉందని మనం తీర్మానిద్దాం.
- వ్రాయబడినా వ్రాయబడకపోయినా, సమస్త మనుష్యులకు చట్టముంది – కాని తనకున్న చట్టాన్ని ఎవడును ఎప్పుడును [నిర్దోషంగా] పరిపూర్ణంగా దానిననుసరించ లేదు – చివరికి, అందరును చట్ట ఉల్లంఘన చేసినవారే.
- అది వాస్తవమైనందున, చట్టము అందరికిని "ఉగ్రతను" తెచ్చింది.

ఈ తీర్మానం మీద పౌలు వచనం 16ను నిర్మించాడు: "ఈ హేతువుచేతను [చట్టము ఉగ్రతనేగాని దీవెనను కలుగజేయని కారణాన] ఆ వాగ్దానము … విశ్వాసమూలమైన దాయెను." చట్టము/క్రియా నియమము కేవలం ఉగ్రతను మాత్రమే పుట్టించినట్టయితే, అప్పుడు వాగ్దానము కృప/విశ్వాస నియమం ద్వారానే నెరవేర్చబడుతుంది. "అందువలన అదంతా విశ్వాసం మీదికి తిప్పబడింది" అని Goodspeed తర్జుమా అంది.

"ఈ హేతువుచేత … కృప ననుసరించినదై యుండునట్లు, అది విశ్వాసమూలమైన దాయెను" [*charis*] (16ఎ వచనం) అని పౌలు చెప్పాడు. "నరునిపట్ల అది విశ్వాస విషయంగాను, ఔదార్యము దేవుని [భాగం]" అంటూ Phillips తర్జుమా చేశాడు. వాగ్దానము అబ్రాహామునకు అనుగ్రహింపబడిన *ఈవి* – అతడేమి చేశాడో దానిమీద కాక, అతని విశ్వాసం మీద ఆధారపడినదైయుంది. "జాతినిబట్టి గాక కృపనుబట్టియే రక్షింపబడ్డారని"[20] యూదులు గ్రహించుకోవలసిన అవసరత ఉంది (లూకా 3:7–9 చూడు). మన రక్షణ కూడ "కృప ననుసరించునదైయుండునట్లు, అది విశ్వాసమూలమైనదాయెనని" మనం అర్థం చేసికోవాలి!

### "అనేక జనములకు తండ్రి"

> ఆ వాగ్దానము యావత్సంతతికి, అనగా ధర్మశాస్త్రముగలవారికి మాత్రముకాక అబ్రాహామునకున్నట్టి విశ్వాసముగలవారికి కూడ దృఢము కావలెనని … అతడు మనకందరికి తండ్రియైయున్నాడు (ఇందును గూర్చి "నిన్ను అనేక జనములకు తండ్రినిగా నియమించితిని" అని వ్రాయబడియున్నది) (16బి, 17ఎ వచనాలు).

"ఆ వాగ్దానము యావత్సంతతికి దృఢము కావలెనని" వాగ్దానము యొక్క నెరవేర్పు విశ్వాసము కృప అనేవాటి ద్వారా వచ్చింది (రోమా 4:16బి). [చట్టము] ధర్మశాస్త్రము/క్రియలు వాగ్దానాన్ని *నిరర్థకం* చేస్తుంది (14 వచనం), గాని కృప/విశ్వాస నియమము దాన్ని *దృఢపరచుతోంది*. "సంతతి" అనేది *sperma* నుండి తర్జుమా చేయబడింది, "బీజము" అనే పదం (KJV చూడు). ఇది సాధారణంగా ఒకటి లేక ఎక్కువైన భౌతిక సంతతివారిని సూచిస్తుంది. అయితే యిక్కడ ఆ పదం *ఆత్మ సంబంధమైన* పిల్లలను సూచిస్తుంది.

ఈ గ్యారంటీ "ధర్మశాస్త్రము గలవారికి [యూదులకు] మాత్రము కాక అబ్రాహామునకున్నట్టి విశ్వాసము గలవారికి కూడ యివ్వబడింది – అతడు అందరికిని తండ్రియై యున్నాడు" (16సి వచనం).[21] ఈ గ్యారంటీ యేసునందు విశ్వాసముంచిన యూదులకు మాత్రము కాదు, కాని "అబ్రాహామునకు కలిగిన విశ్వాసము యొక్క అడుగుజాడలనుబట్టి నడుచుకొనిన" అన్యజనులకును యివ్వబడింది (12 వచనం). ఈ విధంగా అబ్రాహాము "మనకందరికిని [ఆత్మసంబంధమైన] తండ్రియై ఉన్నాడు"; యూదుడైన లేక అన్యుడైన, విశ్వసించువారందరికి.

అబ్రాహామునకు వాగ్దానము చేసినవాటిలో ఇది ముందుగానే ప్రవచింపబడినదని పౌలు అంటాడు: "(రాయబడిన ప్రకారము 'నేను నిన్ను అనేక జనములకు తండ్రిగా చేయుదును')" (17ఎ వచనం). అబ్రాహాము 99 సంవత్సరములు గలవాడై ఉన్నప్పుడు దేవుడు ప్రత్యక్షమై అతనితో తన వాగ్దానాన్ని మరల ప్రస్తావించిన సమయాన్ని ఈ వాక్య భాగం సూచిస్తుంది. ఆ సమయంలో దేవుడు అబ్రాహాముతో యిలా అన్నాడు, "… నిన్ను అనేక జనములకు తండ్రినిగా నియమించితిని" (ఆదికాండము 17:5).

*భౌతికంగా* అబ్రాహాము "అనేక జనములకు తండ్రియై ఉన్నాడు." తన కుమారుడైన ఇస్సాకు, మనుమడైన యాకోబు ద్వారా అతడు ఇశ్రాయేలు జనాంగమునకు "తండ్రియై" ఉన్నాడు. అతని మరో కుమారుడు ఇష్మాయేలు "(అరబ్బులకు) పితామహుడుగా ఎంచబడ్డాడు."[22] మరొక భార్య కెతూరా ద్వారా అతనికి యితర కుమారులు ఉన్నారు (ఆదికాండము 25:1–4); వారిలో ఒకడు మిద్యానీయుల మూలపురుషుడు. అబ్రాహాము మనుమడైన ఏశావు ఎదోమీయులకు మూలపురుషుడయ్యాడు (ఆదికాండము 25:30 చూడు).

ఏదియెలాగున్నా, ఆత్మచేత నడిపింపబడినవాడై, ఆదికాండము 17:5లో ఆత్మ సంబంధమైన ప్రవచనం యిమిడియున్నదని పౌలు చెప్పాడు: అబ్రాహాము "అనేక జనములకు *ఆత్మ సంబంధమైన* తండ్రియైయున్నాడు." పౌలు మాటలతో ఆటలాడి యుండవచ్చు. "జనములు" అనేదానికి గ్రీకు పదం *ethnos* (దానినుండి "ethnic" అనే పదం వచ్చింది) – "అన్యజనులు" అనేదానికి గ్రీకు పదం *ethnos*. ఈ కొటేషన్

రోమా 4:17లో అక్షరార్థంగా తర్జుమా చేస్తే – "అనేక జనములకు నేను నిన్ను తండ్రినిగా చేసియున్నాను." "అబ్రాహామునకు మనకు ఏ రక్త సంబంధం లేకున్నను దేవుడు నిన్ను, నన్ను అందులో ఉండనిచ్చాడు" అని McCord ఆనందించాడు![23]

## ముగింపు

పిల్లలు కొన్నిసార్లు "తండ్రియైన అబ్రాహామును" గూర్చి పాడతారు:

> తండ్రియైన అబ్రాహాముకు అనేక కుమారులున్నారు;
> అనేక కుమారులు తండ్రియైన అబ్రాహాముకున్నారు;
> నేను వారిలో ఒకడిని
> ఆలాగే నీవును,
> గనుక మనమందరం ప్రభువును స్తుతించుదాం![24]

అందులో ఎంతటి అద్భుతమైన సత్యముందో గ్రహించకయే చిన్న పిల్లలు ఈ పాట పాడుతూ ఎంజాయ్ చేస్తారు!

మన పాఠం యొక్క మూల వాక్యంలో – మనం అబ్రాహాము పిల్లలం కావడంలో సున్నతికి ఏ సంబంధం లేదు – ఎందుకంటె సున్నతి అనే కర్మకాండ స్థాపించడానికి 14 సంవత్సరాలకు ముందే అబ్రాహాము విశ్వాసంవలన నీతిమంతుడుగా తీర్చబడ్డాడని పౌలు నొక్కి చెప్పాడు. [అంతేకాదు] దానితో మోషే ధర్మశాస్త్రానికి కూడ ఏ సంబంధం లేదు – ఎందుకంటే ధర్మశాస్త్రం యివ్వడానికి శతాబ్దాలకు ముందే అబ్రాహాము విశ్వాసము వలన నీతిమంతుడుగా తీర్చబడ్డాడు. మన విశ్వాసం తన విశ్వాసంతో పోల్చదగినదై నప్పుడు అబ్రాహాము మనకు ఆత్మ సంబంధమైన తండ్రియై ఉంటాడు. మరో చోట పౌలు దానిని ఈ విధంగా అన్నాడు:

> యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు. ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు ... ; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు. మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాముయొక్క సంతానమైయుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు (గలతీయులకు 3:26–29).


మన తరువాత పాఠంలో, అబ్రాహామునకు కలిగిన విశ్వాసాన్ని ఎక్కువ సన్నిహితంగా పరీక్షించుదాం. ఈ స్టడీని ముగిస్తుండగా, "అబ్రాహాము నీ తండ్రియా?" అని నేను అడుగుతున్నాను. అంటే, అబ్రాహాము విశ్వాసంవంటి విశ్వాసం నీకుందా? నీవు నిజంగా దేవునియందు నమ్మికయుంచుతున్నావా? ఆయన వాగ్దానం చేసినది నెరవేర్చువాడని నీకు నమ్మకముందా? నీ విశ్వాసాన్ని అబ్రాహామువలె కార్య రూపంలో పెట్టనిష్టపడతావా? యేసునందలి నీ విశ్వాసాన్ని విధేయతతో వ్యక్తపరచకపోయినట్టయితే (లూకా 6:46; మత్తయి 7:21; మార్కు 16:16 చూడు), వెంటనే అలా చేయుమని నేను నిన్ను కోరుతున్నాను.

## సూచనలు

[1]Jim Townsend, *Romans: Let Justice Roll* (Elgin, Ill.: David C. Cook Publishing Co., 1988), 31. [2]Hugo McCord, discussion of Romans 4:13-25 presented to students at Oklahoma Christian College (now University), n.d., cassette. [3]ఇస్సాకును బలిగా అర్పించుమని దేవుడు అబ్రాహామునకు యిచ్చిన ఆజ్ఞకు యిది రెఫరెన్సు. [4]రోమా 4కును, గలతీయులకు 3కును చాలా పోలికలున్నాయి. రోమా 4కు ముందు గలతీయులకు 3చదువు. [5]సున్నతికి సంబంధించిన స్వభావాన్ని యూదులలోనుండి క్రైస్తవులైనవారు కనుపరచిన తీరు అపొస్తలుల కార్యములు 15:1లో చూడు. [6]ఆది భాషలో మూలవాక్యం "సున్నతిగలవారు," "సున్నతిలేనివారు" (KJV చూడు). [7]బైబిల్లో విషయాలు ఎల్లవేళల కాలక్రమంలోనే దాఖలు చేయలేదు. ఈ సంఘటనలకు సంబంధించి అబ్రాహాము వయస్సు యివ్వబడింది (ఆదికాండము 12:4; 16:3, 16; 17:1 చూడు). రబ్బీయుల కాల క్రమం ప్రకారమైతే, ఆదికాండము 15:6కును, అధ్యాయం 17కును మధ్య ఎక్కువ వ్యత్యాసముంటుంది. [8]సెప్టూజెంట్ LXXలోను, రోమా 4:11లోను "గురుతు" అనేదానికి ఒకే గ్రీకు పదం వాడబడింది. [9]John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 129. [10]Douglas J. Moo, *Romans,* The NIV Application Commentary (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 2000), 154.

[11]Adapted from Richard A. Batey, *The Letter of Paul to the Romans,* The Living Word Commentary (Austin, Tex.: R. B. Sweet Co., 1969), 60. [12]F. F. Bruce, *The Letter of Paul to the Romans,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 108. [13]"సంతానము" *sperma*నుండి తర్జుమా చేయబడింది "బీజము" (KJVచూడు) "సంతానం" మీద 4:16 నోట్సు చూడు. [14]అబ్రాహామునకు యివ్వబడిన భూ వాగ్దానము – అతడును అతని సంతతియు కనానును స్వాస్థ్యంగా పొందుతారనేది. ఆ వాగ్దానం పాత నిబంధనలో నెరవేర్చబడింది. అది యికను నెరవేర్చబడవలసిన అవసరత లేదు. ఇశ్రాయేలు రాజ్యము కొన్నిసార్లు మధ్యధరా సముద్రంనుండి యూఫ్రటీసువరకు వ్యాపించింది. (ఆదికాండము 15:18; 2 సమూయేలు 8:3; KJV; 1 రాజులు 8:65 చూడు.) [15]మోషేకు బయలుపరచబడడానికి శతాబ్దాలకు ముందే ధర్మశాస్త్రము అబ్రాహాము కలిగియున్నాడని యూదుల ఉపదేశకులు వక్కాణిస్తారు; అయితే పౌలు దాన్ని కాదంటున్నాడు. [16]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons, 1971), 228. [17]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 3. [18]J. D. Thomas, *Romans,* The Living Word series (Austin, Tex.: Sweet Publishing Co., 1965), 34. [19]NASBలో గలతీయులకు 3:19; 1 తిమోతి 2:14; హెబ్రీయులకు 2:2; 9:15లో ఈ పదం "transgression[s]" అని తర్జుమా చేయబడింది. [20]Dave Miller, sermon presented on the *Truth in Love* Television program, Fort Worth, Texas, 23 January 2002.

[21]ఈ వచనంలో "law"కు ముందు definite article ఉంది, గనుక పౌలు ప్రత్యేకించి యూదులను గూర్చి మాట్లాడాడు. రక్షణకు రెండు మార్గాలున్నాయని వచనం 16 ఉపదేశిస్తున్నట్టు కొందరు చిత్రించ ప్రయత్నించారు: ఒకటి యూదులకు, మరొకటి అన్యజనులకని. ఆ అధ్యాయాన్ని సంపూర్ణంగా చదివిన తరువాత ఒకడు ఆలాటి తీర్మానానికి ఎలా వస్తాడో నాకు తెలియడం లేదు. యేసునందు తమ నమ్మికయుంచిన యూదులు పౌలు మనస్సులో ఉన్నారు. [22]William Baur and Roland K. Harrison, "Ishmael," *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 2:905. [23]McCord. [24]రచయిత తెలియదు (http:// www.kididdles.com/mouseum / f033. html; Internet; accessed 11 November 2004).




అబ్రాహాము పయనించిన దేశం